# "బాధ్యతాయుతమైన జీవనమే నిజమైన దేశభక్తి"

**మహిళలకు అవగాహన కల్పించిన డా. అడ్డాల**

**కాకినాడ, పెన్ పవర్,మే 11:**స్థానిక రమణయ్యపేటలోని ఆడబాల ట్రస్ట్‌లో మహిళలను ఉద్దేశించి నిర్వహించిన కార్యక్రమంలో డా. అడ్డాల మాట్లాడుతూ బాధ్యతాయుతమైన జీవన విధానమే నిజమైన దేశభక్తి అని పేర్కొన్నారు.ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రతి భారతీయుడు పొదుపు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన విషయాలను ఆయన వివరించారు.

ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత, అనవసర విదేశీ ప్రయాణాలు తగ్గింపు, బంగారం కొనుగోళ్లు నియంత్రణ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహం వంటి అంశాలను ప్రజలు ఆచరించాలని సూచించారు. ప్రతి భారతీయుడు తన దైనందిన జీవితంలో పొదుపు పాటిస్తేనే దేశం గ్లోబల్ సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోగలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలి

- రీ-ఓపెన్ అయ్యే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,మే 11:**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలను తప్పనిసరిగా గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం,రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, సీపీవో పీ.త్రినాథ్,బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు,డ్వామా పీడీ ఎస్. మధుసూదన్,డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసు,డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు,అర్జీలు స్వీకరించారు.

బియ్యం కార్డుల మంజూరు,పేర్ల మార్పులు చేర్పులు,పింఛన్లు,ఉద్యోగ ఉపాధి అవకాశాలు,మురికి కాలువలపై ఆక్రమణల తొలగింపు,డ్రైన్లు మరియు కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్య సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపిస్తూ వాటిపై సమగ్ర విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను రాష్ట్ర ప్రభుత్వం మండల,రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేకంగా ఆడిట్ నిర్వహిస్తోందని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రతి అర్జీని సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు.ఒకే అంశంపై పదేపదే దరఖాస్తులు నమోదవుతున్నట్లయితే ఆ సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.అలాగే సమస్యను పరిష్కరించలేని పరిస్థితుల్లో దానికి గల కారణాలను అర్జీదారులకు నేరుగా వివరించాలని సూచించారు.అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు తెలిపారు.రెవెన్యూ క్లినిక్‌లో భూ సమస్యలపై వినతులు


రెవెన్యూ శాఖలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా సోమవారం పీజీఆర్ఎస్‌లో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,డీఆర్వో డా.టి. తిప్పే నాయక్, కాకినాడ మరియు పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు,ఎన్. శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.రీ సర్వే, భూముల ఆన్‌లైన్ నమోదు, జాయింట్ ఎల్పీఎంలు,22ఏ భూములు,సర్వే నెంబర్లు తదితర రెవెన్యూ అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించి అర్జీలను సకాలంలో పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,మండల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 49 ఫిర్యాదుల స్వీకరణ





**సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాలు**

**కాకినాడ, పెన్ పవర్,మే 11:**కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, మొత్తం 49 ఫిర్యాదులను స్వీకరించారు.అందులో భూ తగాదాలకు సంబంధించినవి 11, కుటుంబ కలహాలకు సంబంధించినవి 19, ఇతర విభాగాలకు చెందినవి 19 ఫిర్యాదులుగా గుర్తించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను ఆదేశించారు.ఫిర్యాదులపై 7 రోజుల లోపు విచారణ పూర్తి చేసి తగిన పరిష్కారం చూపడంతో పాటు పూర్తి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎస్పీ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కాకినాడ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక దాడులు

**22 కేసులు నమోదు.. 6 మందికి జైలు శిక్ష, రూ.1.60 లక్షల జరిమానా**

**కాకినాడ, పెన్ పవర్,మే 11:**రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కాకినాడ జిల్లా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత కట్టుదిట్టం చేశారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు ఆదివారం కాకినాడ ట్రాఫిక్-1 మరియు ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 22 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అందులో ట్రాఫిక్-1 పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు, ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ పరిధిలో 12 కేసులు నమోదయ్యాయి.వాహన తనిఖీల అనంతరం నిందితులను కాకినాడ 3వ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి చింతా నాగేంద్రరావు శిక్షలు విధించారు.

మొత్తం 6 కేసుల్లో జైలు శిక్షలు విధించగా, అందులో మూడు కేసుల్లో మూడు రోజుల చొప్పున,ఒక కేసులో రెండు రోజుల పాటు,మరో రెండు కేసుల్లో ఒక్క రోజు చొప్పున జైలు శిక్ష విధించారు.ఇక మిగిలిన 16 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.1,60,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.



# కాకినాడను గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దాం






- ప్రజా దర్బార్ ద్వారా సమస్యలకు వేగవంత పరిష్కారం
- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

**కాకినాడ, పెన్ పవర్,మే 11:**కాకినాడ నగరాన్ని గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని కేవలం 23 నెలల్లోనే అమలు చేసి చూపామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. ప్రభుత్వం, పోలీసు శాఖ సమన్వయంతో చేపట్టిన చర్యల ఫలితంగా నగరంలో గంజాయి నిర్మూలనలో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని, ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇంకా ఎక్కడైనా గంజాయి సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సోమవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కార్పొరేషన్ అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి వాటికి సత్వర పరిష్కారం అందించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 160 అర్జీలు అందినట్లు తెలిపారు.వితంతు, దివ్యాంగుల పెన్షన్లు,ఇల్లు స్థలాలు,త్రాగునీటి సమస్యలు,వీధి దీపాల లోపాలు,డ్రైనేజీల శుభ్రత, మౌలిక వసతుల సమస్యలు తదితర అంశాలపై వివిధ డివిజన్ల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వినతిపత్రాలు సమర్పించారు.అందిన ప్రతి అర్జీపై వేగవంతంగా స్పందించి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ముఖ్యంగా త్రాగునీటి సరఫరా,విద్యుత్ సమస్యలు,వితంతు పెన్షన్లు వంటి ప్రజలకు అత్యవసరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కాకినాడ నగరంలో ప్రజా దర్బార్ ద్వారా వచ్చిన సమస్యలను క్రమబద్ధంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్న ఎమ్మెల్యే, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన డ్రైనేజీలలో సిల్ట్ తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించి ముంపు రహిత కాకినాడగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్.ఈ. పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, డీఈ లక్ష్మీనారాయణ, శానిటేషన్ సూపర్వైజర్లు నాయుడు, రాంబాబు, హౌసింగ్ ఏడీ, పి-4 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జీవో 322 దగ్ధం.. ఆత్రేయపురంలో యూనియన్ ఆగ్రహ జ్వాలలు





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 11:**యూనియన్ నాయకుల పిలుపుతో సోమవారం ఆత్రేయపురం డీసీసీ బ్రాంచ్ ప్రాంగణం ఆందోళనలతో మార్మోగింది. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 322ను "ఉద్యోగులు, సహకార రంగానికి వ్యతిరేకమైన అబద్ధపు జీవో"గా అభివర్ణించిన యూనియన్ నాయకులు, వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కమిషనర్ బాబు నిరంకుశ వైఖరిని ఖండిస్తూ యూనియన్ సభ్యులు జీవో 322 ప్రతులను బహిరంగంగా చించివేసి దగ్ధం చేశారు. "ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిర్ణయం ఉద్యోగుల హక్కులపై దాడి" అంటూ నినాదాలతో నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా సాగింది.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆత్రేయపురం బ్రాంచ్ సహకార సంఘ యూనియన్ నాయకులు, సభ్యులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది కేవలం ఆరంభం మాత్రమే. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమం పెను ఉప్పెనలా మారుతుంది. ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము" అని హెచ్చరించారు.ప్రభుత్వం వెంటనే జీవో 322ను వెనక్కి తీసుకొని ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, మే 11:** అమెరికాలో నివసిస్తున్న భృగుమళ్ళ వందన దంపతులు తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు గుండా విశ్వేశ్వరావు రత్నశ్రీ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా జగ్గంపేట గోకవరం రోడ్డు లోని ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ లో సోమవారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరావు (కొండబాబు) మాధురి రత్న ఆండాళ్ దంపతులు ముఖ్యఅతిథిలుగా పాల్గొని పేదలకు అన్నదానం చేశారు.

# నేడు జగ్గంపేటలో హనుమాన్ శోభాయాత్ర

**జగ్గంపేట, పెన్ పవర్,. మే 11:** హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం జగ్గంపేటలో శ్రీ హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని శోభాయాత్ర కమిటీ సభ్యులు పాబోలు స్వామి, పల్లా రాము, ఏనుగు సుబ్రహ్మణ్యం, ఈగల సూర్యనారాయణ మాస్టారు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జగ్గంపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండ బాబు శోభాయాత్రను ప్రారంభిస్తారన్నారు. హిందూ బంధువులంతా తప్పకుండా శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పాలచర్ల నాగేంద్ర చౌదరికి పరామర్శ



**జగ్గంపేట, పెన్ పవర్, మే 11:** అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యులు, టిడిపి యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి మాతృమూర్తి అనంతలక్ష్మి స్వర్గస్తురాలైన విషయం తెలుసుకున్న అన్నవరం శ్రీ సత్యదేవ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి చక్రధర్ రావు, టీడీపీ రాష్ట్ర సెక్రెటరీ, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు పర్వత సురేష్ , ఇతర బోర్డు సభ్యులు జగ్గంపేటలోని వారి నివాసానికి వెళ్లి పాలచర్ల నాగేంద్ర చౌదరి ని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్వర్గీయ అనంతలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే టిడిపి నేతలు ముసిరెడ్డి నాగేశ్వరరావు, ముండ్రు ఎర్రబాబు, ఉప్పలపాటి బుల్లెబ్బ, కందుల సత్యనారాయణ, కాకరపల్లి కామేశ్వరరావు, మీసాల సత్తిబాబు, చేలికాని హరిగోపాల్, తుమ్మల కిషోర్ పరామర్శించారు.

# విద్యార్థి మిత్ర కిట్ల భద్రతపై ప్రత్యేక దృష్టి





వెలిచేరు స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన రాష్ట్ర స్థాయి అధికారి ఉషారాణి

**ఆత్రేయపురం పెన్ పవర్ మే 11:**ఆత్రేయపురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెలిచేరులో ఏర్పాటు చేసిన "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర" కిట్ స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర స్థాయి అధికారి వై. ఉషారాణి సోమవారం పరిశీలించారు. 2026–27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు, స్కూల్ బ్యాగులు, షూస్ తదితర సామాగ్రిని అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలని ఆమె అధికారులకు సూచించారు. విద్యార్థులకు సరఫరా చేసే ప్రతి వస్తువు సమయానికి, నాణ్యతతో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బి.వి. సుబ్రహ్మణ్యం కూడా స్టాక్ నిర్వహణ, పంపిణీ విధానాలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో "విద్యార్థి మిత్ర" కిట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు పి.వి. ప్రసాదరావు, ఏ. సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమశేఖరం, ఎం.ఐ.ఎస్. రాంబాబు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో బడి పిలుస్తోంది





**గండేపల్లి, పెన్ పవర్, మే 11:** బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మూడు క్లస్టర్లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సొపాధ్యాయులు ... ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చేర్చి ఉన్నారు .

రామయ్య పాలెం , నాయికంపల్లి , ఎల్లమెల్లి నీలాద్రి రావు పేట , ఎర్రం పాలెం , ఉప్పలపాడు గ్రామాల్లో మండల విద్యాశాఖ అధికారులు కేహెచ్ నాయక్ మరియు కే వెంకట్ రెడ్డి గారి ఆధ్వర్యంలో క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు మల్లేపల్లి మరియు నాయకంపల్లి వారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది ..

ఇందులో భాగంగా 11 మంది అంగన్వాడి మరియు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అయినారు ..

ముఖ్యంగా మన ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయుచున్న కార్యక్రమాలు విద్యార్థి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ఈ కార్యక్రమం జరిగింది ప్రతిరోజు కూడా మండలంలో అన్ని క్లస్టర్స్ లో ఈ కార్యక్రమాన్ని జరుపుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు చేరే విధంగా మండల విద్యాశాఖ రోజువారి ప్రణాళిక అమలు చేయుచున్నది......

# జగపతినగరంలో టిడిపి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం.

-ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదం.



**కిర్లంపూడి పెన్ పవర్, మే 11**:కిర్లంపూడి మండలం జగపతినగరంలో జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు, జిల్లా టీడీపీ కార్య నిర్వహణ కార్యదర్శి చదరం చంటిబాబు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చదరం చంటిబాబు మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని చంటిబాబు అన్నారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో ఉదయం నుంచే ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మజ్జిగ స్వీకరించారు. వేసవి కాలంలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాళ్ళ వెంకటేష్, ఆళ్ళ నానాజీ, గుడాల రాంబాబు పెంటకోట శివ, దాడి బాబి, మళ్ళ రమేష్, సాయి, కె సురేష్,సిహెచ్ బాబి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో ఏ పీ- మేకర్- లాబ్ - ఆన్స్






**గండేపల్లి, పెన్ పవర్, మే 11:**ఆదిత్య యూనివర్సిటీ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ అమలు చేస్తున్న ఏ పీ- మేకర్–లాబ్ – ఆన్స్ మొబైల్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించింది.

గౌరవనీయులైన నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రారంభించబడిన ఈ ఆధునిక మొబైల్ ల్యాబ్‌లో 3డీ ప్రింటర్, ఇండస్ట్రీ 4.0 ప్రయోగ కిట్లు, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్ సదుపాయాలు వంటి ఆధునిక వనరులు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ ఇండియా మరియు ఇ ఎస్ జి విజన్––2030 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ మరియు దూర ప్రాంతాల విద్యార్థులకు సాంకేతిక విద్యను పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

ట్రైనర్ బాను ప్రకాష్ విద్యార్థులకు రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, మైక్రోకంట్రోలర్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ప్రయోగాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఇ సి ఇ, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిసియల్ ఇంటెల్ జెంట్ ఒ మెషిన్ లెర్నింగ్ మరియు డేటా సైన్సు విభాగాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఈ మొబైల్ ల్యాబ్‌ను సందర్శించి ప్రాయోగిక శిక్షణ ద్వారా ప్రయోజనం పొందారు. అలాగే ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్న కోర్సుల గురించి కూడా విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీ నివాస రెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం బి శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్లు. డా ఎ రమేష్, డా ఎస్. రమాశ్రీ,డీన్ లు డా రవికుమార్,డా.సుబ్బారావు,డా. వానతి తదితరులు పాల్గొన్నారు.

# 132 కేవీ లైన్ల మరమ్మత్తులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**కాకినాడ, పెన్ పవర్,మే 11:**ఏపీ ట్రాన్సకో గొల్లపాలెం పరిధిలో గల 132 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనుల కారణంగా ఈ నెల 13, 15 వి తేదీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవసరాన్ని బట్టి అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.ఈ అంతరాయం కాజులూరు మండలం,కరప మండలం, తాళ్లరేవు మండలం మరియు పెదపూడి మండలాల్లోని సంపర సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలు,ఇండస్ట్రియల్ యూనిట్లు మరియు ఆక్వా సర్వీసులకు వర్తిస్తుందని పేర్కొన్నారు.విద్యుత్ మరమ్మత్తు పనులు సజావుగా నిర్వహించేందుకు వినియోగదారులు సహకరించాలని ఏపీ ఈపీడీసీఎల్ ఎలక్ట్రికల్ ఆపరేషన్ కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

# ఏలేశ్వరం లో ప్రజలకు త్రాగునీటి కష్టాలు.





**మురికి నీటి కూపంగా తయారైన దళిత వాడలు.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 11 :** అసలే వేసవికాలం, కార్చిచ్చులా దహిస్తున్న ఎండ తీవ్రత. ఈ కష్టకాలంలో మంచి నటి సమస్య అంటే ప్రాణాలు పోయే పరిస్థితే. 20 వార్డులు ఉన్న ఏలేశ్వరం నగర పంచాయతీలో 10, 11 వార్డుల్లో మూడు రోజులుగా ప్రజలకు త్రాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ రెండు వార్డులకు నంది వీధి దగ్గర ఉన్న ట్యాంక్ నుండి ప్రజలకు త్రాగునీటి సరఫరా జరుగుతూ ఉంటుంది. అయితే ఏలేశ్వరం పట్టణంలో విద్యుత్ వినియోగం పెరగడం వల్ల, ట్రాన్స్ఫార్మర్ల కొరత వల్ల తరచూ హై వోల్టేజ్, లో వోల్టేజ్ సమస్యతో మోటార్లు మొరాయించడంతో మంచినీటిని 10, 11 వార్డుల్లో సప్లై నిలిచిపోయింది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అసలే ఎక్కువగా నిరుపేదలైన దళితవాడలు ఉన్న ప్రాంతాలు ఇవి. వీరు పంచాయితీ కుళాయిలు మీద ఆధారపడ్డారు. కొట్టు బోర్లు ఉన్నప్పటికీ అవి సంవత్సరాల తరబడి రిపేర్ లో ఉన్నాయి. దీంతో ప్రజలకు త్రాగునీటి కష్టాలు మరింత ఎక్కువ అయ్యాయి. దీంతో స్పందించిన నగర పంచాయతీ అధికారులు రెండు రోజుల తర్వాత ఒక ట్యాంక్ తో మంచినీరు అందిస్తున్నారు. అది కూడా చాలీచాలనంత సప్లై చేయగలుగుతున్నారు. దీంతో ప్రజలకు తాగునీటి తోపాటు వాడకం నీరు సమస్య కూడా ఉంది. డ్రైన్లు మురికి కూపాల్లా తయారయ్యాయి. వీధుల్లో దుర్గంధం వ్యాప్తి చెందుతుంది. వీధిలో నిలబడలేకపతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు . దోమల బెడద ఎక్కువగా ఉంది. కనీసం కాలువలపై దోమల మందు పిచికారి చేయడం లేదు, దీంతో తమ పిల్లలు విష జ్వరాల బారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. 11వ వార్డులో ఇళ్ళ మధ్య చెత్త వారాల తరబడి గుట్టలు గుట్టలుగా పేరుకుపోయినా కనీసం నగర పంచాయతీ సిబ్బంది ఊడ్చడం లేదు. ఇకనైనా నగర పంచాయతీ అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి, తమ వార్డుల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని, కొట్టు బోర్లు బాగు చేయించాలని, మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏపీఈసెట్ రాష్ట్ర ఫస్ట్ ర్యాంకర్ అనూషకు ఘన సత్కారం

- ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థినులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచన





**కాకినాడ, పెన్ పవర్,మే 11:**ఏపీఈసెట్ రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించిన ఎన్. అనూషను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఘనంగా సత్కరించారు.కాకినాడ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహం నెంబర్-04లో ఉంటూ కాకినాడ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో డీ-ఫార్మసీ చదువుతున్న అనూష, ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో ప్రవేశం కోసం ఏప్రిల్ 23న నిర్వహించిన ఏపీ ఈసెట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది.ఈ సందర్భంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకు సాధించిన ఎన్. అనూషతో పాటు 17వ ర్యాంకు సాధించిన పి.రాజ్యలక్ష్మి,160వ ర్యాంకు సాధించిన వి.నీలవేణిలను దుశ్శాలువాలతో ప్రత్యేకంగా సన్మానించారు.భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో చదువులో మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎం. శోభారాణి,ఎస్డబ్ల్యూఓ వై.వాణి, హెచ్డబ్ల్యూఓ జి.ఉషారాణి,కార్యాలయ సిబ్బంది పి.టి.దొర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో కాకినాడ జిల్లా కీలకంగా నిలవాలి





**స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెంపుపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**

**కాకినాడ, పెన్ పవర్,మే 11:**మెరుగైన పనితీరుతో జిల్లా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయ స్థాయిని పెంచి రాష్ట్రాభివృద్ధిలో కాకినాడ జిల్లాను కీలకంగా నిలపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను కోరారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాలను వివరించి,వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదాయ సేకరణ శాఖలు నిర్దేశించిన లక్ష్యాల ప్రగతిని ప్రతి వారం సమీక్షించి ఆదాయ వసూళ్లను పెంచాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఆర్థికేతర విజ్ఞాపనలను నూరు శాతం పరిష్కరించి ప్రజా సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరచాలని సూచించారు.మే 15 నుంచి సాగునీటి విడుదలకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు,విత్తనాలు, రుణాలు తదితర అంశాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో అసంపూర్తిగా ఉన్న దాదాపు 25 వేల పేదల గృహాలలో కనీసం 50 శాతం గృహాలను వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.వివిధ శాఖలకు నిర్దేశించిన కేపీఐ సూచికలను గ్రామ, మండల స్థాయిలో లక్ష్యాలుగా నిర్దేశించుకుని అమలు చేయాలని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడీఎస్ శాఖల సమన్వయంతో మాతృ, శిశు మరణాలను కనిష్ట స్థాయికి తగ్గించాలన్నారు.వ్యవసాయం, పరిశ్రమలు,సేవా రంగాలలో జిల్లా స్థూల ఉత్పత్తి వృద్ధిని ప్రస్తుతం ఉన్న 10.75 శాతం నుంచి 12.5 శాతానికి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా ఉత్పత్తిలో కీలకంగా ఉన్న పశు సంవర్ధక రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలు, సాంకేతికత వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న నెలల్లో పంటలు, పశుగ్రాసం సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు అవసరమైన సానుకూల వాతావరణం కల్పించాలని చెప్పారు.టూరిజం రంగంలో జిల్లాకు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని లక్ష్య సాధన దిశగా పనిచేయాలని సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంపు కోసం రూఫ్టాప్ వ్యవస్థల ఏర్పాటు వేగవంతం చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలపై కూడా వీటిని అమలు చేయాలని ఆదేశించారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానంలోనే ఫైళ్లు నడపాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఏవేర్ 2.0 పోర్టల్ సేవలను అన్ని శాఖలు వినియోగించుకోవాలని, వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల కింద కేటాయించిన నిధులను నూరు శాతం వినియోగించి, అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,డీఆర్వో తిప్పేనాయక్తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధితో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

**రూ.14.28 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే పంతం నానాజీ**





**కాకినాడ రూరల్, పెన్ పవర్,మే 11:**పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు.కాకినాడ గుడారిగుంటలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రెండు ఎల్వోసీలతో కలిపి ఆరుగురు లబ్ధిదారులకు రూ.14,28,822 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంతం నానాజీ అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 359 దరఖాస్తులను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించగా, అందులో 267 మందికి రూ.2,48,95,189 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఇంకా 92 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు.పేద కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శిరంగు శ్రీనివాస్,వల్లూరి రాజా, నల్లే ప్రసన్న,ముద్రగడ రమేష్,నందిపాటి అనంతలక్ష్మి,కరెడ్ల గోవింద్, తాటికాయల వీరబాబు,బండారు మురళి,మాదారపు తాతాజీ,దాసరి శివ, పుల్ల వీరబాబు,గరికిన సురేష్,రుద్ర పద్మావతి,జీని శ్రీనివాస్,మాదల రమణ, ప్రసాద్,బుజ్జి,ర్యాలీ సతీష్,రవి కిరణ్ తదితరులు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


## ప్రయాణికుల సౌకర్యార్థం రేకుల షెడ్ తోపాటు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు.

- ప్రయాణికులు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.



**కిర్లంపూడి, పెన్ పవర్, మే 11:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికుల సౌకర్యార్థం పాలెం, గోనేడ, సోమవరం, తామరాడ, రామచంద్రపురం గ్రామాల ప్రజల కోరిక మేరకు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ తుమ్మలపల్లి రమేష్ రేకుల షెడ్ ఏర్పాటు చేశారు.దీంతో పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో అక్కడే చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఈ సేవలను వినియోగించుకుని సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, వేసవి కాలంలో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో రామచంద్రపురం గ్రామం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, రామచంద్రపురం ఎంపీటీసీ బండారు ప్రసాద్, బండారు చక్రధర్, గోకేడ ప్రసాద్,రేవూరి శ్రీను, కొలమూరు బుజ్జి, కొలమూరి భద్ర, గంధం వెంకన్న, దొడ్డి శ్రీను,సత్తిబాబు, కొలమూరు అబ్బాయి, గోకేడ పండు, కనపర్తి జాషువా, తదితరులు పాల్గొన్నారు

# గోపిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో టెన్త్ టాపర్లకు ఘన సన్మానం,




–ముఖ్య అతిధిగా జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ

కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మే 11:ప్రత్తిపాడు ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు యువ నాయకులు అంబటి బుజ్జి వెలుగుల నాని,గోపిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించడంతోపాటు రూ.3 వేల రూపాయలు విలువ చేసే ప్రోటీన్ ఫుడ్,కాలేజీ బ్యాగ్,భోజనం క్యారియర్,వాటర్ బాటిల్ తదితర బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను మాట్లాడుతూ వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో 585 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో రూ.25 వేల ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని ప్రకటించారు.ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ ప్రసాద్,జనసేన జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్,ప్రత్తిపాడు,కిర్లంపూడి మండలాల జనసేన అధ్యక్షులు రామకుర్తి కామేష్,గాబు సుభాష్,నాయకులు గంగిరెడ్ల మణికంఠ,పలివెల వెంకటేష్,పత్రి రమణ,గెడ్డం చంటి,ముత్యాల రాంబాబు,మాగాపు వీరబాబు,శీరం శ్రీను,కుప్పిన శ్రీను,అమరాది శివ,సిరిపురపు శ్రీను,అధ్యాపక బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే మా ప్రధాన బాధ్యత -ఎస్పి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మే 11;** వాతావరణం లో పెను మార్పులు కారణంగా మండలంలో ప్రజలు ,రైతులు, వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై వి క్రాంతి కుమార్ సోమవారం సూచించారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు వచ్చే అవకాశం ఉన్నందున చెట్లు కింద నిలబడవద్దు అని ఈదురు గాలులతో చెట్లు విరిగి ప్రమాదం కలిగే అవకాశం ఉందని అన్నారు. వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలి అని వేగం తగ్గించండి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోండి అని తెలిపారు. కరెంటు స్తంభాలు, విద్యుత్ వైర్ల దగ్గర ఉండవద్దు అని ప్రమాదం జరిగే అవకాశం ఉందని అన్నారు. రైతులు పొలాల్లో పనిచేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి అని మెరుపులు పడే అవకాశం ఉంది ఎత్తైన ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు. పంటలను, ఎరువులను, ధాన్యాన్ని వర్షానికి పడకుండా భద్రపరచుకొని పంట నష్టం అవ్వకుండా చూసుకోవాలని అన్నారు. నీరు నిలిచిన రోడ్డుపై జాగ్రత్తగా వెళ్లాలి అని లోతైన నీటిలో వాహనం నడపవద్దని అన్నారు. అవసరం లేకుండా బయటకు వెళ్లకపోవడం మంచిది అని ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని అన్నారు. పిల్లలను, వృద్ధులను జాగ్రత్తగా చూసుకుని వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూసుకోవాలని అన్నారు. జాగ్రత్తగా ఉండండి సురక్షితంగా ఉండండి అంటూ ఎస్సై సూచించారు.

## ఉంగుటూరు మురుగు కోడు తవ్వకం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే




**పెన్ పవర్ ఉంగుటూరు, మే 11:**తోకలపల్లి మెయిన్ డ్రైన్‌లోకి కలిసే ఉంగుటూరు మురుగు కోడు (డ్రైన్) తవ్వకం పనులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోమవారం పరిశీలించారు. పూడికతో నిండిపోయిన ఈ మురుగు కోడులో పూడిక తీయడం వల్ల పరిసర వ్యవసాయ భూములకు ముంపు ముప్పు తగ్గుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ, ఎన్నో రోజులుగా ముంపు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రస్తుతం చేపడుతున్న తవ్వకం పనులతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

రైతుల అభిప్రాయాలను తెలుసుకున్న ఎమ్మెల్యే ధర్మరాజు, పొలాలకు వెళ్లే మార్గం ప్రస్తుతం మురుగు కోడు గట్టుమీద మాత్రమే ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులు సురక్షితంగా, సౌకర్యవంతంగా పొలాలకు వెళ్లే విధంగా గట్టుపై మట్టితో దారిని సద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు. మూడు కిలోమీటర్ల మేర తవ్వకానికి రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు ప్రజాశక్తికి వివరించారు.

## తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి భూమి పూజ

పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కేడర్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 11:**తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి 16 వార్డు హుక్కుంపేట ఆవలో సోమవారం రుడా చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి భూమి పూజ నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో వేదమంత్రోత్సవాల మధ్య ముహూర్తం 9. 05 గంటలకు భూమి పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బొడ్డు వెంకటరమణ చౌదరి3 తో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, మజ్జి పద్మ , నక్క చిట్టిబాబు పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. అంతరం వెంకటరమణ మీడియాతో మాట్లాడుతూ, తూర్పుగోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం తన హయాంలో నిర్మాణం జరగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి బాబు నాయుడు, విద్యామంత్రి లోకేష్ ,రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల సహకారంతో సంవత్సరం కాల వ్యవధిలో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యాలయం కి సంబంధించి రెండు ఎకరాల భూమి సిసిఎల్ఏ, రెవెన్యూ అధికారుల వద్ద అన్ని అనుమతులు తీసుకున్నామని, జి ప్లస్ వన్ లో నిర్మించే కార్యాలయన్ని కూడా అనుమతులు తీసుకునే పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లో ఇటువంటి కార్యాలయాల నిర్మాణానికి భూమి పూజ జరిగిందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పార్టీ కార్యాలయం నిర్మించే యోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 2027 జనగణనకు ప్రజల సంపూర్ణ సహకారం అవసరం



జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మే 11:**పోలవరం జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడు తమ కుటుంబాలకు సంబంధించిన వివరాలను ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు అందించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో 2027 జనాభా గణన (సెన్సెస్)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనగణనలో భాగంగా మొదటి విడత ఇంటింటి సెన్సెస్ జాబితా నిర్వహణ మే 1 నుండి మే 30 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేలో ప్రతి ఇంటి స్థితిగతుల వివరాలు నమోదు చేయబడతాయని, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని సూచించారు.సేకరించిన సమాచారం అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివరాలు అందించడం వల్ల ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై ఎటువంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. మొదటిసారిగా డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించబడుతోందని తెలిపారు.జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మీ వివరాలే దేశ ప్రగతికి మెట్లు అని కలెక్టర్ పేర్కొన్నారు. జనగణన చట్టం--1948 ప్రకారం గణనలో పాల్గొనడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. ప్రజల సహకారంతో దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి పి. అంబేద్కర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ రత్నాకర్ రావు, ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణ, తాసిల్దార్లు సిహెచ్ బాలాజీ, అమ్మాజీ, సిహెచ్ శ్రీనివాస్ ,దొరకయ్య, వేణుగోపాల్, కే. సత్యనారాయణ, ఏ. సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దార్లు పాయాజ్ భాష (జిలాని), పృధ్వి, శ్రీధర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి 67 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**గండేపల్లి, పెన్ పవర్, మే 11**



పెదబ్రహ్మదేవం గ్రామంలో గల శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నాడు 67 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు (1960–2026) ఘనంగా నిర్వహించినట్లు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన పెద్దలు మనకు అందించిన ఈ ఆధ్యాత్మిక,సేవా పరమైన వారసత్వ సంపదను కాపాడుకోవడమే కాకుండా మరిన్ని సమాజ సేవల తో ప్రజలకు సహాయం అందించాలని అన్నారు. మూర్తిత్రయ సూక్తులను బోధనలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా యువతను సన్మార్గంలో పయనించేలా చేయాలని అన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ది. ఉ. 5.15ని. సుప్రభాత హారతి, ఉ. 8.30ని.విశేషపూజ, ఉ.10–00 గం. లకు సర్వ సభ్య సమావేశం అనంతరం పులిహోర మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్,సహాయ కార్యదర్శి తోటకూర సాంబశివరావు, కోశాధికారి తేలుగుంట్ల నరసింహారావు,సభ్యులు టి.వి.వి. సత్యనారాయణ, ఆచంట సత్యనారాయణ, కమ్మిల వెంకటేశ్వరావు, నువ్వుల బాబ్జి,నువ్వుల సూర్యచంద్రరావు,తోట రమణ, తోటకూర సూర్య ప్రభాకర రావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పని ఒత్తిడికి లోనుకాకుండా విధులు నిర్వహించాలి



- రాజవొమ్మంగి ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత మరణంపై సంతాపం
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మే 11:** పోలవరం జిల్లాలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పని ఒత్తిడికి లోనుకాకుండా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అధికారుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.రాజవొమ్మంగి ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమని, ఇది జిల్లాకు తీరని లోటని కలెక్టర్ అన్నారు. రాజవొమ్మంగి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలబాలికలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ఆమె ఎంతో చురుకుగా పనిచేశారని ఆయన గుర్తు చేశారు. ఆమె మరణంపై విచారణ జరిపించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుజాత కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్, సిడిపిఓలు క్రాంతి కుమారి, ప్రత్యక్ష, డీడీలు రుక్మాండయ్య, షరీఫ్, డీఈవో వై. మల్లేశ్వరరావు, డీఎం అండ్ హెచ్ ఓ పి. సరిత, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, డిఆర్డిఏ పిడి డాక్టర్ రత్నాకరరావు, సిపిఓ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ గ్రీవెన్స్ లో 47 ఫిర్యాదులు



**రాజ మహేంద్రవరం, పెన్ పవర్, మే 11:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.

జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చా రు. నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 47 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు మరియు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

